క్లుప్తంగా

రేపు నామినేషన్లు పరిశీలిస్తాం..

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను రేపు(సోమవారం) పరిశీలిస్తామని అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేది వరకు 23 మంది అభ్యర్థుల నుంచి 35 నామినేషన్లను వచ్చినట్లు తెలిపారు. ఆయా నామినేషన్లను స్థానిక కార్యాలయంలో పరిశీలిస్తామన్నారు.

నేడు వేలం పాట

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని శ్రీద్వాదశి జ్యోతిర్లింగ చిన్న అరుణాచలేశ్వర ఆలయంలో దుకాణాల నిర్వహణకు నేడు (ఆదివారం) వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు శివనాగ స్వామి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని రెండు దుకాణాల్లో ఈ ఏడాది కార్తీకమాసం నుంచి వచ్చే ఏడాది కార్తీకమాసం వరకు పూజా సామగ్రి దుకాణాల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు నేడు మధ్యాహ్నంలోపు 8247259616, 9908229103 నంబర్లను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని, వేలం పాట సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

పాయం గెలుపునకు కృషి

అశ్వాపురం: కాంగ్రెస్, సీపీఐ పార్టీల శ్రేణులు కలిసి కట్టుగా పని చేసి ఎన్నికల్లో పినపాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలుపునకు కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి అన్నారు. మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్, సీపీఐల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో నాయకుల మధ్య చిన్న చిన్న భేదాభిప్రాయాలు ఉన్నా ఎన్నికల వరకు అన్ని పక్కన పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఎంపీపీ సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సీపీఐ నాయకులు పుల్లారెడ్డి, సురేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దీపం.. విభిన్న రూపం..

- ఆకర్షణీయ డిజైన్లలో ప్రమిదలు
- ఇంటికి అనుగుణంగా ఎంచుకుంటున్న ప్రజలు
- జోరందుకున్న అమ్మకాలు

సండే స్పెషల్


మార్కెట్‌లో అమ్ముతున్న వివిధ రూపాల్లోని ప్రమిదలు

భద్రాచలంటౌన్: దీపావళి అనగానే చిన్న, పెద్ద తేడా లేకుండా ఎంతో ఆనందంగా జరుపుకునే వేడుక. దీపావళి పండుగ అంటేనే చీకటిని పారదోలుతూ.. వెలుగులు తెచ్చే పండుగగా జరుపుకుంటారు. ఆ వెలుగుల కోసం మహిళలకు ప్రత్యేకంగా మట్టితో తయ్యారు చేసే ప్రమిదలు వాడుతారు. దీంతో వ్యాపారులు వివిధ రకాల వెరైటీలలో మట్టి, పింగాణి ప్రమిదలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భద్రాచలం పట్టణంలోని మార్కెట్లో వీటి దుకాణాలు రోడ్డు పక్కన ఏర్పాటు చేయగా, ప్రజలు వాటికి ఆసక్తి చూపిస్తున్నారు.



వివిధ రకాల డిజైన్లలో ప్రమిదలు

కాలానుగుణంగా ప్రమిదలకు ప్రాధాన్యత

ఒక్కప్పుడు దీపావళి అనగానే అందరికీ ఠక్కున గుర్తుకు వచ్చేది టపాసులు. ఇంకా చెప్పాలంటే పండుగకు నెల రోజుల ముందు నుంచే చిన్న పిల్లలు చిన్నచిన్న టపాసులు కొనుగోలు చేసి కాల్చుతుండే వారు. అందువల్ల కొన్ని రోజుల నుంచే ఎక్కడో ఒక్క చోట టపాసుల శబ్దం వినిపిస్తూ ఉండేది. అయితే ఇప్పుడు కాలానుగుణంగా వచ్చిన మార్పుల వల్ల ప్రజలు ఆలోచనా విధానం మారింది. టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఈ కారణంగా ప్రజలు టపాసులను కాల్చడం చాలా వరకు తగ్గించారు. కేవలం దీపావళి రోజు మాత్రమే పిల్లల ఆనందం కోసం ప్రజలు టపాసులు కాల్చుతున్నారు. కొంత మంది పండుగ రోజు కూడా టపాసులకు దూరంగా ఉంటున్నారు. అయితే, పర్యావరణ నష్టం లేకుండా, దీపావళి వేడుక వైభోగం తగ్గకుండా పండుగ జరగడానికి ప్రమిదలు పెద్ద పాత్ర పోషిస్తున్నాయి.

కొత్త డిజైన్‌లు.. అనుగుణమైన ధరలు

వ్యాపారులు సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆధునికత, సాంకేతికతను కలబోస్తూ నేటి తరానికి నచ్చే రీతలో అనేక డిజైన్లలో ఈ ఏడాది దీపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజలు తమ ఇళ్లకు తగ్గట్లు ఇంటి ముంగిట ఆకర్షణీయంగా ఉండే ప్రమిదలకు ప్రాధాన్యతనిస్తున్నారు. కాస్త ఖరీదైనప్పటికీ ఆకర్షణీయంగా ఉండే వెరైటీలనే ఇష్టపడుతున్నారు. ఈ అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. మట్టి ప్రమిదలతో పాటు పింగాణి దీపాలు, విద్యుత్ ద్వారా వెలిగే దీపాలు సైతం వచ్చాయి. ఒక్కొక్క దీపం రూ.10 నుంచి 300 వరకు ధర పలుకుతోంది. వివిధ రకాల విద్యుత్ అలంకరణ దీపాలను రాజస్థాన్, కోల్‌కత, తమిళనాడు, బెంగళూర్ వంటి ప్రాంతాల నుంచి తెప్పించి అమ్ముతున్నారు. గోల్డ్ కలర్‌లో ఆకర్షణీయంగా ఉండే తోరణాలు రూ.600ల నుంచి అమ్మకాలు జరుతున్నాయి. ఈ మేరకు పట్టణాల్లో దుకాణాలు ఇప్పటికే ఏర్పాటవగా.. విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

పింగాణి బొమ్మలు బాగున్నాయి

మార్కెట్లో పింగాణి దిపాల బొమ్మలు ఆకర్షణీయంగా ఉన్నాయి. కాలనికి అనుగుణంగా మార్కెట్‌లో అందుబాటులో ఉండే విద్యుత్ ప్రమిదలతో పలు రకాల వెరైటీస్ లభిస్తున్నాయి. ధరలూ అందుబాటులో ఉండే వాటిని కొనుగోలు చేస్తున్నాం.

– రాజ్యలక్ష్మి, భద్రాచలం

దీపాలతోనే ఇంటికి శోభ

దీపావళి పండుగ, కార్తీక మాసం సందర్భంగా ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ఇళ్ల ప్రత్యేక శోభను సంతరించుకుంటాయి. ఆకర్షణీయంగా ఉండే ప్రమిదల్లో ఇంటి ముంగిట దీపాలను వెలిగిస్తే ఇంటికి మరింత అందం వస్తుంది.

– రమాదేవి, భద్రాచలం

ఈ ఏడాది అమ్మకాలు ఓకే..

గత మూడేళ్లు కరోనా కారణంగా వ్యాపారం సాగలేదు. మాకు ఖమ్మంతో పాటు భద్రాచలంలో దుకాణాలు ఉన్నాయి. ఖమ్మం కంటే భద్రాచలంలోనే వ్యాపారం బాగుటుంది. కొత్త వెరైటీల మూలంగా ఈ ఏడు అమ్మకాలు బాగున్నాయి.

– ఉపేందర్, ప్రమిదల వ్యాపారి

అభివృద్ధి, సంక్షేమమే అజెండా


లక్ష్మీపురంలోని సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ అజెండా అని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 13న లక్ష్మీపురంలో జరగనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ముఖ్యమంత్రి సభకు పినపాక నియోజకవర్గం నుంచి 60వేలమందికి పైగా ప్రజలు హాజరు కానున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎం సభకు వచ్చే ప్రజలకు సహకరించాలని కోరారు. అంతకుముందు పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోనేరు చిన్ని, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్లు పరిశీలన

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 13వ తేదీన లక్ష్మీపురంలో జరగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను శనివారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో కలసి సభాస్థలిని పరిశీలించిన ఆయన.. పలు సూచనలు చేశారు. సీఎం సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల నియమావళిని పార్టీ నాయకులు, కార్యకర్తలు కచ్చితంగా పాటించేలా ముందస్తు అవగాహన కల్పించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీల ముమ్మర ప్రచారం

రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీల నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీల నాయకులు పట్టణాలు, గ్రామాల్లో ప్రజలను కలుస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేసి గెలిపించాలని, అధికారంలోకి వస్తే మేనిఫెస్టోల్లోని సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాలను పంచుతూ ముందుకు కదులుతున్నారు. కార్యక్రమాల్లో ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చర్ల: పెదమిడిసిలేరు ప్రచార సభలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య


దమ్మపేట: ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణ


భద్రాచలంఅర్బన్: పట్టణంలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

జాతీయ విద్యా దినోత్సవం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకులంలో స్వాతంత్ర్య సమరయోధుడు, భారత దేశ మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి దివంగత మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం అశోక్ నగర్ కొత్త కాలనీలోని అరబ్బీ మదర్స జామియా ఇస్లామీయలో భారత రత్న, మొట మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్ జయంతి వేడుకలు శనివారం అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు షేక్ మహబూద్, రాంబాబు, షేక్ మస్తాన్, సయ్యద్ ఉస్మాన్, చైతన్య, షేక్ బుడెం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ములకలపల్లి: మండలంలోని పలు పోలింగ్‌స్టేషన్లను అశ్వారావుపేట నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు గణేశ్ శనివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లోనూ పాతగంగారం గ్రామంలో ఏర్పాటు చేసిన స్టేషన్లను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటర్లకు అసౌకర్యం కలుగకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ శ్రీను, ఆర్ఐలు తారాచంద్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉమాదేవిని గెలిపించాలి

ములకలపల్లి: బీజేపీ బలపర్చిన అశ్వారావుపేట నియోజకరవర్గ జనసేన అభ్యర్థి ముయ్యబోయిన ఉమాదేవిని గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు అనుమల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జనసేన, బీజేపీ కార్యకర్తల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమాదేవి విజయానికి శక్తివంచనలేకుండా కృషి చేయాలని అన్నారు. జనసేన మండల అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్, ఎస్‌కె.పాషా, శివప్రసాద్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు గుగులోతు శంకర్ శనగపాటి సీతారాములు, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, పాలకుర్తి ప్రసాద్, జర్పుల శివ, జె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికల నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై షాహీన హెచ్చరించారు. శనివారం మండలంలోని రాజాపురం గ్రామంలో ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమావేశాలను నిర్వహించేందుకు అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచారం చేయకూడదని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా స్టాళ్లు ఏర్పాటు

మణుగూరురూరల్: దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మణుగూరు పట్టణంలోని పాత జీసీసీ గ్రౌండ్‌లో బాణసంచా దుకాణాలు(స్టాళ్లు) ఏర్పాటు చేశారు. దీపావళి అంటేనే విద్యుత్ కాంతులు, టపాసుల మోతలు. బాణాసంచా కొనుగోలు చేసుకునేందుకు ప్రజలు మైదానంలోని బాణాసంచా దుకాణాలు వెళ్లాల్సిందే. చిన్న పిల్లలకు ఇష్టమైన భూచక్రాల నుంచి పెద్దవారికి తౌజండ్ వాలా, 100వాలా, రాకెట్లు, తారాజువ్వలు బాణసంచా దుకాణాలలో ఆకర్షిస్తున్నాయి. ప్రజలు కూడా బాణసంచా కొనుగోలు చేసేందుకు దుకాణాల వద్దకు వెళ్తున్నారు. మొత్తానికి దీపావళి పండుగ పట్టణం, బాణ సంచా దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

హోమియోపతి వైద్య శిబిరం

చర్లరూరల్: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గుంపెనగూడెం గ్రామంలో హోమియోపతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ పూజ రోగులను పరీక్షించి వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఏఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ శిరీషతోపాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

అశ్వాపురం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ హైదారాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్న మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు మండలం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం తరలివెళ్లారు. వారిలో సంఘం జిల్లా నాయకుడు ఇసంపల్లి కృష్ణ, గుర్రం ప్రసాద్, సురేష్, పున్నరావు, మచ్చా నరసింహారావు, మందా హుస్సేన్, రావులపల్లి నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

చంద్రమోహన్ మృతిపై సంతాపం

దుమ్ముగూడెం: ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందడంపై టీటీడీ మండల ప్రచారక్ పిలకా నాగేంద్రరెడ్డి, కళాకారుడు కొమరం దామోదర్‌లు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సినీ చలనచిత్ర రంగంలో 932 సినీమాల్లో విభిన్న పాత్రలలో నటించిన చంద్రమోహన్ మృతి చెందడం సినీ రంగానికి తీరని లోటని అన్నారు.

కొనసాగుతున్న వలసలు

ఎన్నికల సందర్భంగా మొదలైన పార్టీల్లోకి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వలసలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా శనివారం భద్రాచలంలో ఎంపీపీ ఊకే శాంతమ్మతో సహా పలువురు ముఖ్య నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అటు అశ్వారావుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ ఆధ్వర్యంలోనూ కాంగ్రెస్‌లో పలువురు చేరారు. చర్ల, మణుగూరులో బీఆర్ఎస్‌లో పలు కుటుంబాలు చేరాయి.

– సాక్షి నెట్‌వర్క్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416